

'తొలిఏకాదశి'.. సర్వశ్రేష్ఠం

శివకేశవులు, విష్ణువుకు ప్రీతికరమైన రోజు.. ఉపవాసాలు, వ్రతాలు ప్రారంభమయ్యే శుభ దినం.. పండుగలకు స్వాగతం పలికే రోజు 'తొలి ఏకాదశి'.

- 8లో▸



వ్యవసాయ అనుబంధ రుణాలు పెంచాలి

- 8లో▸

బ్యాంకులు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు రుణాలు పెంచాలని మార్నేని రవీందర్ రావు సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం $29.0^0/25.0^0$

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొబ్బరికాయల వేలం రూ.5.20లక్షలు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయం వద్ద కొబ్బరికాయలు అమ్ముకొనుటకు మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలంపాట నిర్వహించగా రూ.5,20,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్, దేవాదాయ శాఖ పరిశీలకులు అనిల్‌కుమార్ తెలిపారు. గతేడాది రూ.4.31లక్షల ఆదాయం రాగా ఈసారి అదనంగా రూ.89,500 ఆదాయం పెరిగిందన్నారు. వేలం పాటను జనగాం రమేష్ దక్కించుకున్నట్లు వెల్లడించారు. పాటదారుడు ఏడాది పాటు రామప్పలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు హక్కు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీశ్‌శర్మ, జూనియార్ అసిస్టెంట్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లపై విచారణ చేపట్టాలి

ఏటూరునాగారం: జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లపై వస్తున్న ఆరోపణల మీద ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట ఫలితంగా ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు రావడం విచారకరమన్నారు. ముఖ్యంగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులపైన ఆరోపణలు రావడం దురదృష్టకరం అన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంపై వస్తున్న ఆరోపణల మీద ఉన్నతాధికారులు విచారణ జరిపి నష్టపోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు.

తీగజాతి కూరగాయల సాగుకు రాయితీ



భూపాలపల్లి రూరల్: పందిర్ల కూరగాయల సాగుకు ప్రభుత్వం 50శాతం రాయితీ కల్పించిందని.. జిల్లాలోని ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంజీవరావు తెలిపారు. జిల్లాలో కూరగాయల తోటలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. జిల్లాలో సుమారుగా 150 నుంచి 170 ఎకరాలలో అన్ని రకాల కూరగాయల సాగు ప్రతి సంవత్సరం అవుతుందన్నారు. మన జిల్లా ప్రజల అవసరాలకు సరిపోయే కూరగాయల సాగు కావడం లేదని చెప్పారు. ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకునే పరిస్థితి ఉందన్నారు. కూరగాయల సాగును పెంచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు జిల్లా ఉద్యాన శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఘనంగా సీత్లా పండగ



రేగొండ: గిరిజనులు ప్రతి ఏటా నిర్వహించుకునే సీత్లా పండగను వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం తండాలో గిరిజన పెద్దలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు గ్రామ సమీపంలో అమ్మ వారికి పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలంటూ అమ్మ వారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుగులోత్ నర్సయ్యానాయక్, బానోత్ మంగ్తానాయక్, యువకులు బానోత్ రాజేందర్ నాయక్, రాములు, జగన్, మోహన్ నాయక్, లక్ష్మణ్, రాజేందర్, రాహుల్, వినోద్ పాల్గొన్నారు.

లక్ష్యం దిశగా..

వనమహోత్సవంలో 6.25లక్షల మొక్కలు నాటేందుకు ప్రణాళిక





ఇంచర్ల ఎకో పార్కులో మొక్క నాటుతున్న మంత్రి సీతక్క(ఫైల్)

- సకాలంలో లక్ష్యం చేరాలని మంత్రి సీతక్క ఆదేశం
- ఇప్పటి వరకు నాటినవి 4,29,106
- మరో పదిరోజుల్లో టార్గెట్ చేరుకునేలా ముందుకు
- ప్రతిరోజూ పర్యవేక్షిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు: జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తుండడంతో కార్యక్రమ నిర్వహణకు ఊతంగా మారింది. ఇప్పటికే 76శాతం అటవీ ప్రాంతం ఉన్న జిల్లాలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 6,02,538 మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. అవెన్యూ, బ్లాక్ ప్లాంటేషన్‌లతో పాటుగా రైతుల పంట పొలాలు, ఉద్యానశాఖ నర్సరీలు, చెరువు కట్టలు, పోడుకు గురైన భూములు, ప్రభుత్వ కార్యాలయాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో మొక్కలు నాటుతున్నారు.

జిల్లాను ముందంజలో ఉంచాలని మంత్రి ఆదేశాలు

వనమహోత్సవ కార్యక్రమాన్ని అటవీశాఖతో సమన్వయం చేసుకుంటూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నిర్వహణ కార్యక్రమాలను చూస్తుంది. ముఖ్యంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క త్వరితగతిన లక్ష్యం చేరి జిల్లాను ముందంజలో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు ఆమె నేరుగా వనమహోత్స కార్యక్రమాన్ని ప్రారంభించారు. ములుగు మండలం జాకారం సోషల్ వెల్ఫేర్ గురుకులం, ఇంచర్ల సమీపంలో ఎకో ఫారెస్ట్ ప్రాంతాల్లో మొక్కలు నాటి అధికారుల్లో ఉత్సాహాన్ని నింపారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడుకోవాలని అధికారులకు సూచించారు.

10రోజుల్లో లక్ష్యం చేరేలా..

దీంతో అప్రమత్తమైన కలెక్టర్ టీఎస్.దివాకర ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి 10రోజుల్లో టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా కేటాయించిన టార్గెట్ ఇప్పటి వరకు నాటిన మొక్కల వివరాలపై ప్రతిరోజూ ఆరా తీస్తున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఉరుకులు, పరుగుల మధ్య లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నారు. సోమవారం వరకు జిల్లా వ్యాప్తంగా 4,29,106 మొక్కలు నాటగా మరో 1,73,432 మొక్కలు నాటాల్సి ఉంది.

మండలం	టార్గెట్	ఇప్పటి వరకు నాటినవి
ములుగు	1,10,400	87,016
వెంకటాపురం(ఎం)	79,327	60,710
గోవిందరావుపేట	62,510	45,282
ఎస్ఎస్ తాడ్వాయి	62,100	40,136
ఏటూరునాగారం	43,262	34,666
కన్నాయిగూడెం	37,939	26,894
మంగపేట	86,250	40,364
వెంకటాపురం(కె)	62,100	53,485
వాజేడు	58,650	40,553

మంత్రి, కలెక్టర్ ఆదేశాల మేరకు నడుచుకుంటున్నాం..

మంత్రి ధనసరి సీతక్క, కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశాల మేరకు అటవీ శాఖ అధికారులతో సమన్వయంతో ముందుకు వెళ్తున్నాం. వచ్చే 10 రోజుల్లో టార్గెట్ పూర్తి చేయాలనే కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేస్తున్నాం. పడుతున్న వర్షాలు, వాతావరణం సైతం మొక్కలు నాటేందుకు అనుకూలంగా ఉంది. అన్ని శాఖల అధికారులు టార్గెట్‌ను సకాలంలో పూర్తిచేసే ఆలోచనలో ఉన్నారు.

- వెంకటనారాయణ, ఏపీడీ

● సీఎం సమావేశంలో కలెక్టర్, ఎస్పీ



హైదరాబాద్‌లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితో జరిగిన సమావేశంలో పాల్గొన్న ములుగు కలెక్టర్ టీఎస్.దివాకర, ఎస్పీ శబరీశ్

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చూడాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ములుగు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే సీజనల్ వ్యాధుల వ్యాపికి అడ్డుకట్ట వేయవచ్చని, పారిశుద్ధ్య నిర్వహణను బాధ్యతగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పారిశుద్ధ్యంపై సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతిరోజూ రోడ్లు, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని సూచించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడడంతో పాటు ప్లాస్టిక్ కనిపించకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం వార్డు సిబ్బంది, సానిటేషన్ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలో పారిశుద్ధ్య పనులు ఆశించిన స్థాయిలో జరగటం లేదని, అనేక ప్రాంతాల్లో రోడ్డుపై నీరు నిల్వ ఉండటం గమనించినట్లు తెలిపారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టాలన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు, అంగన్ వాడీ టీచర్లతో సమన్వయం చేసుకొని ప్రజలకు పారిశుద్ధ్య ప్రాముఖ్యపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, సంక్షేమ హాస్టళ్లను నేరుగా తనిఖీ చేయాలన్నారు. ప్రతీ శుక్రవారం గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో ఉదయం 7గంటలకు ఫ్రైడే డ్రైడే నిర్వహించాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్లు పనికొచ్చేలా చూడాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ సెక్రెటరీలు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న డీపీఓ శ్రీనివాస్

ఎస్ఎస్‌తాడ్వాయి: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీపీఓ శ్రీనివాస్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మేడారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మాస్ ప్లాంటేషన్ కార్యక్రమానికి ఆయన హాజరై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్ల వెంట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. మొక్కల సంరక్షణతోనే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందడమే కాకుండా సకాలంలో వర్షం కురుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడారం ఈఓ రాజేంద్రం, ఎంపీఓ శ్రీధర్‌రావు, ఐకేపీ ఏపీఓ శ్రీనివాస్‌రావు, ఈజీఎస్ ఏపీఎం అనిల్, పంచాయతీ కార్యదర్శులు కొర్నెబెల్లి సతీష్, ధర్మేందర్, రాజశేఖర్, జ్ఞానేశ్వరి, నర్మద, రాజేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యమే ప్రధానం

ఏపీఓ వసంతరావు



మహిళా ఉద్యోగికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, పర్యవేక్షిస్తున్న ఏపీఓ వసంతరావు

ఏటూరునాగారం: ఉద్యోగస్తులు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సేవ చేస్తారని, ఆరోగ్యమే ప్రధానమని అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశాల మేరకు ఉద్యోగస్తులకు మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ వసంతరావు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్‌తో కలిసి పర్యవేక్షించి మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర ఒత్తిళ్లకు గురికావడం సహజమన్నారు. తరచూ వైద్యపరీక్షలు నిర్వహించుకోవడం ద్వారా ఆరోగ్యాలను కాపాడుకోవచ్చని తెలిపారు. గతంలో ఇటువంటి స్క్రీనింగ్ కార్యక్రమం లేదని, ఐటీడీఏ ఉద్యోగుల ఆరోగ్యం గురించి ఆలోచించే అధికారులలో మొదటి ప్రాజెక్ట్ అధికారి చిత్రా మిశ్రా అని అభివర్ణించారు. ప్రతీఒక్క ఉద్యోగి తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో 58మంది ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, వైద్యులు నరహరి, సుజాత, మౌనిక, అనూష, విజయ్‌కుమార్, అప్తాల్మిక్ వైకుంఠం, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, శ్వేత, అరుణ్, ప్రోగ్రాం మేనేజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కాంపిటీషన్లలో ద్వితీయ బహుమతి



ద్వితీయ బహుమతి అందుకుంటున్న ఐటీఐ విద్యార్థులు

ఏటూరునాగారం: రాష్ట్రస్థాయి స్కిల్ కాంపిటీషన్లలో ఏటూరునాగారం ఐటీఐ కళాశాల విద్యార్థులు ద్వితీయ బహుమతి సాధించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ప్రావీణ్య స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కిల్ కాంపిటీషన్‌లలో ఐటీఐ విద్యార్థులు ప్రతిభకనబర్చారు. ఎలక్ట్రానిక్ ట్రేడ్‌లో సాయికుమార్, వెంకటేష్, సిద్దార్థ్, స్వామి, సాయికుమార్, చరణ్‌కుమార్, మెకానికల్ ట్రేడ్‌లో నందు, శశికుమార్, ప్రవీణ్, సందీప్, శ్రీతేజ, రమేష్‌లు ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి నుంచి ఎనిమిది ఐటీఐల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ద్వితీయ బహుమతిగా విద్యార్థులు రూ.20వేల నగదును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్(ఏటీఓ), వావిలాల ముఖేష్‌కుమార్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న జంపన్న నాయక్

ములుగు: రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు భూక్య జంపన్న నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం రేషన్ కార్డుతో లింకు పెట్టడం సరికాదన్నారు. రేషన్ కార్డులు లేని నిరుపేద రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రైతులను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం మార్గదర్శకాల పేరుతో కొత్త నాటకాన్ని తెరపైకి తీసుకొచ్చిందన్నారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులను పరిగణలోకి తీసుకొని రుణమాఫీని అమలు చేయాలన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

గణపురం: మండలకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చిట్యాల సీఐ డి.మల్లేష్ అన్నారు. గణపురం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం పలువురు వ్యాపారవేత్తలు, పలు సంఘాల నాయకులతో ఎస్సై సాంబమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలకేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమన్నారు. ఒక్కో సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానం అన్నారు. ముఖ్యంగా నేరాలు జరిగిన సమయంలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో అవసరమని చెప్పారు. వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు సహకరించాలని కోరారు.

నిబంధనలకు లోబడి చికిత్స చేయాలి

డీఎంహెచ్‌ఓ అప్పయ్య



పాషా ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య



ఆరాధ్య ఆస్పత్రి యాజమాన్యాన్ని హెచ్చరిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఏటూరునాగారం: ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యులు నిబంధనలకు లోబడి రోగులకు చికిత్స చేయాలని, ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే ఆస్పత్రిని సీజ్ చేస్తామని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పాషా, ఆరాధ్య ఆస్పత్రులను ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరాధ్య ఆస్పత్రికి ఎలాంటి లైసెన్స్ లేనందున నోటీసులు జారీ చేశామన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున ప్రజలు చిన్న చిన్న జబ్బులకు గురి అవుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్తగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో మండల కేంద్రంలోని పాషా హాస్పిటల్‌ని ఆకస్మికంగా తనిఖీ చేశామన్నారు. పది మంచాలలో ఉన్న పేషెంట్లను ఆరా తీయగా మల్లూరు నుంచి నలుగురు జ్వరంతో బాధపడుతుండగా చికిత్స తీసుకుంటున్నట్లు గమనించామన్నారు. వెంటనే మెడికల్ ఆఫీసర్‌కి సమాచారం ఇచ్చి మల్లూరు గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించే విధంగా ఆదేశాలు ఇచ్చామన్నారు. రిసెప్షన్ సెంటర్లో చార్జెస్ లిస్ట్ పెట్టకపోవడం,పరిశుభ్రత పాటించకపోవడం, పర్మిషన్ ఇచ్చిన పడకల సంఖ్య కంటే ఎక్కువ పడకలను వినియోగించడంపై సమాధానం ఇవ్వాల్సిందిగా నోటీస్ జారీ చేసినట్లు డీఎంహెచ్‌ఓ వెల్లడించారు. ఆర్ఎంపీలు రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు పంపించే ముందు సంబంధిత పీహెచ్‌సీ డాక్టర్‌కు విషయం తెలియజేయాలని సూచించారు. అంతేగాని స్వార్థ ప్రయోజనాలకు నేరుగా వైద్యం పేరుతో పంపించి అవసరం లేని పరీక్షలు చేయించి పేషెంట్‌ని ఆర్థికంగా నష్టపోయేలా చేయకూడదన్నారు. కలెక్టర్ ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, ఆర్ఎంపీలతో కోఆర్డినేషన్ మీటింగ్ పెట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ దుర్గారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి



భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని పోస్ట్‌మెట్రిక్ కళాశాలల వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు బొడ్డు స్మరన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా దామెర కిరణ్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బీసీ, కళాశాల వసతి గృహాల నిర్మాణ పనులు ఐదేళ్లుగా జరుగుతున్నాయని తెలిపారు. ఎస్టీ కళాశాలకు వసతి గృహం ఇప్పటి వరకు మంజూరు చేయలేదన్నారు. విద్యార్థులు అద్దె భవనాల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్మరి రాజ్‌కుమార్, నరేష్, స్వామి, ఈశ్వర్, అశ్విత్, శివ, అఖిల్ పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు

గణపురం: ఉపాధిహామీ సిబ్బంది అవినీతికి పాల్పడకుండా విధులు నిర్వహించాలని.. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఓ నరేష్ హెచ్చరించారు. ఎంపీడీవో భాస్కర్ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ నరేష్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో మండలంలో మూడు కోట్ల రూపాయల పనులు జరగగా.. 89వేల రూపాయల అవినీతిని గుర్తించినట్లు చెప్పారు. సంబంధిత బాధ్యుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు.

● బొగత.. ఫిదా



సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం కనువిందు చేస్తోంది. మంగళవారం కొద్దిమంది పర్యాటకులు వచ్చి నప్పటికీ జలపాతం అందాలకు ఫిదా అయ్యారు. పాలనురగలా జాలువారుతున్న నీటి పరవళ్లతో నిండుగా కనిపిస్తుండడంతో వీక్షకులు ఫొటోలు తీసుకున్నారు. - వాజేడు

కాళేశ్వరాలయంలో పూజలు



గోదావరిలో పూజలు చేస్తున్న కార్తికేయన్

కాళేశ్వరం: తమిళనాడు రాష్ట్రం అరుణాచలంలోని తిరువణ్ణామలై దేవస్థానం ప్రధాన అర్చకుడు కార్తికేయన్ ఆయన శిష్య బృందం 11 మందితో కలిసి కాళేశ్వరాలయం దర్శించుకున్నారు. అరుణాచలం నుంచి రెండురోజుల కిందట హైదరాబాద్‌కు ఓ ఆలయ పూజకు రాగా.. మంగళవారం కాళేశ్వరం చేరుకొని త్రివేణి సంగమ గోదావరిలో బోటులో వెళ్లి పుణ్యస్నానాలు చేశారు. గోదావరిలో గంటపాటు పూజలు చేశారు. అనంతరం స్వామివారి రాజగోపురం చేరుకోగా అర్చకులు స్వాగతం పలికారు. గణపతిపూజ చేసి గర్భగుడిలో ద్విలింగాలకు విశేష పూజలు చేశారు. వారికి అర్చకులు ద్విలింగాల ప్రాశస్త్యాన్ని వివరించారు. శ్రీశుభానందదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ ఆశీర్వచన వేదిక వద్ద కాళేశ్వరం దేవస్థానం ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట హైదరాబాద్ టూరిజంశాఖ అధికారి పవన్, కాళేశ్వరం హరితహోటల్ మేనేజర్ జక్కం సురేష్, దేవస్థానం మాజీ చైర్మన్ పోత వెంకటస్వామి ఉన్నారు.

గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి పట్టివేత కేసులో ఒకరికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి దేవానాయక్ కథనం ప్రకారం.. కేసముద్రం ఎస్సై తిరుపతి, ఏఎస్సై కృష్ణమూర్తి, పీసీలు సత్యనారాయణ, వెంకన్న గతేడాది అక్టోబర్ 16వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కేసముద్రం స్టేషన్ సెంటర్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో విచారించారు. అతడి దగ్గర ఉన్న రెండు బ్యాగుల్లో 8 ప్యాకెట్లలో 16 కిలోల 290 గ్రాముల ఎండు గంజాయి లభించగా స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్ తరలించారు. పట్టుబడిన వ్యక్తి ఒడిశాలోని గజం జిల్లా షేర్ గడ గ్రామానికి చెందిన రంజిత కుమార్ ప్రధాన్ గా గుర్తించి కేసు నమోదు చేశారు. అప్పటి రూరల్ సీఐ బి.రమేశ్ విచారణ జరిపి అనంతరం బదిలీ కాగా ప్రస్తుత రూరల్ సీఐ పి.సర్వయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన కోర్టులో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించగా డీఎస్పీ తిరుపతిరావు, రూరల్ సీఐ సర్వయ్య, ప్రస్తుత కేసముద్రం ఎస్సై వంశీధర్ ఆధ్వర్యంలో సీడీఓ దేవానాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలువిన్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్ నేరం నిరూపణకాబడిన రంజిత కుమార్ ప్రధాన్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. గంజాయి రవాణా చేస్తే కఠిన శిక్షలు తప్పవని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ పేర్కొన్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

వరంగల్ లీగల్ : అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటనలో రాయపర్తి మండలం కొలాన్‌పల్లి గ్రామం జయరాం తండాకు చెందిన నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, రూ. 4వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్మలగీతాంబ మంగళవారం తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొలాన్‌పల్లి గ్రామం బండకింది తండాకు చెందిన భూక్య గోపాల్ కుమార్తె రమను జయరాంతండాకు చెందిన లావుడ్యా శ్రీనుకు ఇచ్చి 2004లో వివాహం చేశారు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అప్పటి వరకు బాగానే ఉన్న శ్రీను.. మద్యానికి అలవాటు పడి భార్యను అనుమానించి వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయం రమ తన తల్లిదండ్రులకు తెలుపగా పలుమార్లు పంచాయితీలు నిర్వహించారు. పెద్దల సమక్షంలో తన తప్పు ఒప్పుకుని, భార్యాపిల్లలను తీసుకుని వెళ్లేవాడు. అయినా శ్రీను ప్రవర్తనలో మార్పు లేదు. శ్రీను హింస భరించలేని రమ..2016, ఏప్రిల్ 22న వరంగల్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో 2016, జూలై 1న చేనులో పత్తిగింజలు పెట్టడానికి వ్యవసాయ భూమి వద్దకు శ్రీను తన భార్యను తీసుకెళ్లాడు. మరుసటి రోజు కూడా పని ఉందని చేను వద్దకు తీసుకెళ్లాడు. 2016, జూలై 2న మధ్యాహ్నం 3 గంటలకు జయరాం తండాకు చెందిన ఓ వ్యక్తి ఫోన్ చేసి రమపై శ్రీను కిరోసిన్ పోసి అంటించాడని చెప్పగా రమ తల్లిదండ్రులు కూతురు ఇంటికి వెళ్లారు. అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం తరలించారు. జరిగిన విషయం కూతురు రమను అడగగా కిరోసిన్ పోసి అంటించాడని తెలిపింది. చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత రమ మృతి చెందింది. మృతురాలి తండ్రి గోపాల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణలో సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు.. నేరం రుజువుకావడంతో నేరస్తుడు లావుడ్యా శ్రీనుకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలాగీతాంబ తీర్పు వెల్లడించారు. కేసును ఏసీపీ ఆదినారాయణ, సీఐ సూర్యప్రకాశ్ పరిశోధించగా ఎస్సై వెంకటస్వామి పర్యవేక్షణలో హెచ్‌సీ సోమునాయక్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

'తొలిఏకాదశి'.. సర్వశ్రేష్ఠం


కొడవటూరు సిద్ధులగుట్ట


బీరప్ప కామరతి, మహంకాళి దేవతామూర్తులు


బీరప్ప ఆలయం

నేడు పర్వదినం ప్రారంభం

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- చాతుర్మాస వ్రతాలు షురూ
- ముస్తాబవుతున్న శివ, విష్ణు ఆలయాలు
- పండుగలకు స్వాగతం

జనగామ: శివకేశవులు, విష్ణువుకు ప్రీతికరమైన రోజు.. ఉపవాసాలు, వ్రతాలు ప్రారంభమయ్యే శుభదినం.. పండుగలకు స్వాగతం పలికే రోజు 'తొలి ఏకాదశి'. ఆషాఢ మాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని 'తొలిఏకాదశి' అంటారు. దీనినే 'శయన ఏకాదశి' అని కూడా పిలుస్తారు. ఉత్తర దిక్కున ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిక్కున ప్రయాణించడం వల్ల దీనిని దక్షిణాయణంగా పరిగణిస్తారు. అందుకే శివకేశవులు.. విష్ణువుకు ఈరోజు ప్రీతికరమైనదిగా భావిస్తారు. నేటి బుధవారం తొలిఏకాదశి సందర్భంగా శివ, వైష్ణవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. ఆదిశేషుడి వాహనం కలిగిన నారాయణుడిని లక్ష్మి సమేతంగా పూజ చేయడం వల్ల సకల శ్రేయస్సు కలుగుతుంది. ఈరోజు ఉపవాసాలు, శివనామస్మరణ, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం సర్వశ్రేష్ఠం. తొలిఏకాదశి రోజున విష్ణు నామస్మరణ చేసే వారికి వైకుంఠ ప్రాప్తి కూడా కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు విష్ణువు యోగ నిద్రలో ఉంటాడు. చాతుర్మాస్యం ఈరోజు నుంచే మొదలవుతుంది. అందుకే ఈ నాలుగు మాసాలు ధర్మాచరణ కలిగి విష్ణు ప్రీతికై వ్రతాలు చేయడం నారాయణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల విశ్వాసం. నాలుగు మాసాల్లో వచ్చే ఏకాదశులకు ఇది మొదటిది కావడంతో 'తొలిఏకాదశి' అని పిలుస్తారు. తొలిఏకాదశి రోజున నదీ స్నానం పవిత్రమైనదిగా భావిస్తారు.

ముస్తాబవుతున్న ఆలయాలు

తొలి ఏకాదశి సందర్భంగా జనగామ జిల్లాలోని పాలకుర్తి శ్రీ సోమేశ్వరాలయం, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధేశ్వరాలయం, జనగామ బాణాపురం శ్రీవెంకటేశ్వరాలయం, పాతబీటు శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీసంతోషిమాత ఆలయం, చిల్పూరు శ్రీ వెంకటేశ్వరాలయాలను సుందరంగా అలంకరిస్తున్నారు. తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు.

మూడు రోజుల పాటు వ్రతం..

ఈ ఏకాదశి వ్రతం మూడు రోజులు చేయాలి. రోజు శేషశాయిని అర్చించడం, ఏకాదశి పర్వదినం రోజున ఉపవాసం, ద్వాదశి పారాయణం, త్రయోదశి రోజున గీత నృత్యాదులతో అర్చన చేయాలి. చాతుర్మాస్య వ్రతం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ వ్రతం చేయాలనుకునే భక్తులు మొదటి రోజు నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు నాలుగు నెలల పాటు నిష్ఠతో స్వామికి పూజలు చేయాల్సి ఉంటుంది. పరమాత్ముడికి బెల్లం, తైలం, విడిచి పెడతామని సంకల్పించుకోవాలి. దేవుడికి నివేదన చేయని ఆహారం, పుచ్చకాయ, కాల్చి వండినవి, గుమ్మడికాయ, చెరకు, కొత్త ఉసిరిక, చింతపండు, మంచంపై పడుకోవడం, పరాన్నం, తేనె, పొట్లకాయ, ఉలవలు, తెల్ల ఆవాలు, మినుములు ఈ నాలుగు నెలల పాటు వినియోగించకుండా నిష్ఠతో భగవంతుడి సేవలో నిమగ్నం కావాలి. చాతుర్మాస్య వ్రతాలు, పూజలు చేసిన భక్తులకు దేవతల ఆశీస్సులు దక్కుతాయని భక్తుల విశ్వాసం.

నేడు కురుమ కులస్తుల బోనాలు

తొలి ఏకాదశి సందర్భంగా నేడు జనగామ పట్టణంలో కురుమ కులస్తులు బీరప్ప కామరతి, అక్క మహంకాళి దేవతామూర్తులకు బోనాలు సమర్పించనున్నారు. కుర్మవాడ నుంచి నెహ్రూపార్కు మీదుగా ఒగ్గుడోలు కళాకారుల వాయిద్యాలు.. శివసత్తుల నృత్యాలు.. పోతరాజుల విన్యాసాల మధ్య వేలాది మంది మహిళలు బోనాలతో పాటు పట్టువస్త్రాలతో బీరప్ప ఆలయానికి చేరుకుంటారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనం నైవేద్యం సమర్పించిన అనంతరం, పట్టువస్త్రాలు కానుకగా ఇచ్చి ఒడిబియ్యం పోస్తారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్ట చర్యలు చేపడుతున్నారు.

ఆధ్యాత్మికం

మొహర్రం.. వీరత్వానికి ప్రతీక

నేడు మధ్యకోటలో వేడుకలు

- సాయంత్రం 5గంటలకు భారీ ఊరేగింపు
- 200 ఏళ్ల చరిత్ర గల మధ్యకోట పీరీలు
- పీరీల బావి, చావడీల్లో ముమ్మర ఏర్పాట్లు
- మతాలకతీతంగా పీరీలను దర్శించుకోనున్న భక్తులు


పీరీలను నిమజ్జనానికి తరలిస్తున్న ముస్లింలు (ఫైల్)

ఖిలా వరంగల్: మొహర్రం.. వీర మరణానికి ప్రతీక. ధర్మ రక్షణ కోసం కర్బలా మైదానంలో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందిన వారికి గుర్తుగా మొహర్రం ఉత్సవాలు పీరీలను (సంతాప దినాలు) పది రోజులపాటు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ఇందులో భాగంగా చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయ రాజధాని ఖిలావరంగల్ కోట పీరీలకు సుమారు 200 ఏళ్ల ఘన చరిత్ర ఉంది . ఏటా పదో రోజు మొహర్రం పీరీల ఊరేగింపుల్లో వేలాది మంది కులమతాలకతీతంగా పాల్గొంటారు. ఈ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం. ముస్లింలు తమ ఆరాధ్యదైవంగా భావించే పీరీలను హిందువులు కూడా పూజిస్తారు. మొహర్రం సంతాప దినాల్లో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల ముస్లింలు కూడా ఇక్కడకు చేరుకుని దర్శించుకుంటారు.

మొహర్రం వేడుకలకు సర్వం సిద్ధం..

మధ్యకోట.. బుధవారం జరగనున్న మొహర్రం వేడుకలకు ముస్తాబైంది. ఉదయం 4 గంటల నుంచే పీరీలకు ప్రత్యేక ప్రార్థనలు, సాయంత్రం 5గంటలకు వేలాది ముస్లింల మధ్య భారీ ఊరేగింపు సాగనుంది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లు అధికారులు, ముస్లిం మతపెద్దలు పూర్తి చేశారు. చావడిల్లో నెలకొల్పిన పీరీలకు 200ఏళ్ల ఘన చరిత్ర ఉంది. ఇక్కడి హస్సేన్, హుస్సేన్ పీరీలను దర్శిస్తే కష్టాలు తొలగి కోరికలు సిద్ధిస్తాయన్న నమ్మకం ఉంది. పీరీల ముజవార్ల పర్యవేక్షణ, మొహర్రం కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు పీరీలను దర్శించుకుని ఊరేగింపులో పాల్గొంటారు. ఇప్పటికే పీరీలను రంగుల వస్త్రాలతో అలంకరించారు. తమ కోరికలు తీరిన వాళ్లు పీరీలకు వెండి, బంగారం, గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించనున్నారు.

పీరీల బావి వద్ద ఏర్పాట్లు పూర్తి

మధ్యకోట నుంచి పీరీలు భారీ ఊరేగింపుతో ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ సమీపంలోని కాశికుంట పీరీల బావి వద్దకు రాత్రి 12గంటలలోపు చేరుకుంటాయి. ఇక్కడ ముస్లిం మత్తపెద్దలు భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేస్తారు. మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. ఈ పనులను స్థానిక కార్పొరేటర్లు వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, పోశాల పద్మ, సిద్ధం రాజు పరిశీలించారు.

భారీ బందోబస్తు ఏర్పాటు



త్యాగానికి ప్రతీకైన మొహర్రం ఊరేగింపునకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తాం. సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా మధ్యకోట పీరీల చావడీలను సందర్శించి ఊరేగింపు కొనసాగనున్న రహదారులను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా పరమైన ఆదేశాలు ఇచ్చారు. డీసీపీ ఆదేశాల ప్రకారం ఊరేగింపు పరిసరాల్లో ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా చర్యలు తీసుకుంటాం.

-నందిరామ్‌నాయక్, ఏసీపీ వరంగల్

పాత కక్షలే.. ప్రాణం తీశాయి

- వివరాలు వెల్లడించిన డీసీపీ రాజమహేంద్రనాయక్
- మాజీ సర్పంచ్ దేవేందర్ హత్యకేసులో వీడిన మిస్టరీ


మాట్లాడుతున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

రాయపర్తి : పాత కక్షలతోనే బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ దేవేందర్‌ను ప్రత్యర్థులు హత్య చేసినట్లు జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడించారు. మంగళవారం రాయపర్తిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాయపర్తి మండలం బురహాన్‌పల్లి మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ ఈనెల 7న సొంతింట్లో హత్యకు గురైన విషయం విధితమే. అయితే అదే గ్రామానికి చెందిన ఎనబోతుల ప్రకాశ్ నుంచి దేవేందర్ బయానా ఇచ్చి మూడెకరాల భూమిని కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో డబ్బులు చెల్లించకపోడంతో పల్లె మల్లేశ్‌కు అదే భూమిని విక్రయించాడు. కాగా తాను కొన్న భూమిని నువ్వెలా కొంటావని పల్లె మలేశ్‌తో దేవేందర్‌కు రెండేళ్ల కింద భూ వివాదం తలెత్తింది. దీంతో గొడవలు కాగా దేవేందర్‌తో సహా పలువురిపై కేసు నమోదైంది. గత కొద్దికాలం క్రితం పల్లె మల్లేశ్ విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అది మాజీ సర్పంచే చేయించాడని అతడిని హతమార్చాలని పథకం పన్నాడు. ఈనెల 7న దేవేందర్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడని తెలుసుకున్న పల్లె మల్లేశ్ తన కుమారుడు మురళితో పాటు చెన్ననాయుడు, గోవింద్ మరికొందరితో కలిసి దేవేందర్ తలపై హ్యామర్‌తో కొట్టాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్, మొబైల్‌ను తీసుకుని వెళ్లిపోయారు. పోలీసులు వెతుకుతున్నట్లు గమనించిన పల్లె మల్లేశ్, చెన్ననాయుడు, గోవింద్ మంగళవారం లొంగిపోయారు. పరారీలో ఉన్న పల్లె మురళి, అతడితో ఉన్న మరికొందరికోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ సమావేశంలో ఏసీపీ నర్సయ్య, సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పోసి.. మట్టుబెట్టి

- యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సర్వయ్య

కేసముద్రం: మండల కేంద్రంలో ఈనెల14వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. మంగళవారం కేసముద్రం పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కేసముద్రంవిలేజ్ చైతన్యనగర్‌కాలనీలో ఉంటున్న జిలుకర నాగరాజుపై ఇదే గ్రామం జ్యోతిరావుపూలే సెంటర్ సమీపంలో నివాసముండే వల్లందాసు నగేశ్ కొంతకాలంగా వ్యక్తిగతంగా కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో నాగరాజును ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా నాగరాజును నమ్మించేందుకు నగేశ్ చిన్న పనులు చెబుతూ హత్య చేయాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నగేశ్ భార్య ఉమ అనారోగ్యానికి గురవడంతో ఇటీవల నెల్లికుదురు మండలం బొడ్లాడలోని తన పుట్టింటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న నగేశ్ ఇదే అదునుగా భావించాడు. ఈ నెల 14న నాగరాజును నమ్మించి తన ఇంటికి రప్పించుకున్నాడు. మద్యం తీసుకురమ్మని డబ్బులు ఇవ్వడంతో నాగరాజు తీసుకువచ్చాడు. ఈ క్రమంలో నగేశ్ అన్నం తింటూ నాగరాజుకు మద్యం పోస్తూ వచ్చాడు. మద్యం సేవించిన నాగరాజు మత్తులో మునిగిపోవడంతో అతడి మెడపై కర్రతో కొట్టగా కిందపడ్డాడు. వెంటనే అపస్మారకస్థితిలో ఉన్న నాగరాజు గొంతుపై కాలితో తొక్కి చంపేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టి నిందితుడు వల్లందాసు నగేశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

వ్యవసాయ రంగాల అభివృద్ధే లక్ష్యం

- కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రాజన్న


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజన్న

మామునూరు: వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల అభివృద్ధే పరిశోధన స్థానం లక్ష్యమని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న అన్నారు. ఈమేరకు మంగళవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి 96వ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్ ప్రథమ స్థానంలో, చేపల పెంపకంలో రెండో స్థానంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం, ఉద్యాన పంటల్లో గణనీయమైన ప్రగతి సాధించామని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, నూతన విధానాలతో వ్యవసాయ, వ్యవసాయ రంగాల అభివృద్ధి విషయంలో ముందుకు దూసుకెళ్తోందన్నారు. కృషి విజ్ఞానం కేంద్రంలోని సేవలను రైతులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. అనంతరం రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవస్థాపక దినోత్సవం వేడుకలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజు, శశాంక్, సాయి కిరణ్, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా బైక్ దొంగల అరెస్ట్

- రూ. 8 లక్షల విలువైన పది ద్విచక్రవాహనాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మడికొండ సీఐ ప్రతాప్


బైక్‌ల చోరీకి పాల్పడుతున్న వారి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మడికొండ : ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా దొంగలను మడికొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం మడికొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ప్రతాప్ వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జెన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన సంపెంగి రమేశ్ డ్రైవర్ పని చేస్తూ వచ్చిన ఆదాయంతో జల్సా చేసేవాడు. అయితే జల్సాలకు ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బులు సంపాదించాలనుకున్నాడు. అనుకున్నదే తడువుగా తన స్నేహితుడు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన వాంకుడోత్ రాకేశ్‌తో కలిసి ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడడం ప్రారంభించారు. ఇందులో భాగంగా జగిత్యాల, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలుమార్లు ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడగా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మార్పు రాక పోగా మరోసారి చోరీలకు సిద్ధపడి హైదరాబాద్‌తోపాటు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని మడికొండ, ఇంతేజార్‌గంజ్, పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహన చోరీలకు పాల్పడ్డారు. ఈ చోరీలపై అప్రమత్తమైన మడికొండ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం మడికొండ సెంటర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. రమేశ్ వాహనంపై వస్తుండగా అనుమానం కలిగి తనిఖీ చేయగా వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకుని విచారించగా తన నేరాలను అంగీకరించాడు. అనంతరం నిందితుడు సమాచారం మేరకు మరో నిందితుడు రాకేశ్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఇంటి వద్ద నుంచి తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రతాప్ తెలిపారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మడికొండ ఎస్సైలు రాజాబాబు, దివ్య, ఏఎస్సై రమేశ్, ఏఎఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ రామచంద్ర, రామ్‌నాథం, జంపయ్య, కానిస్టేబుళ్లు రవి, నాగేశ్వర్, ఐటీ కోర్ కమిటీ సభ్యులు నాగేశ్, ప్రవీణ్‌ను సీఐ ప్రతాప్ అభినందించారు.

అద్దంకి దయాకర్‌కు సముచిత స్థానం కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హన్మకొండ : తెలంగాణ ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలో జాతీయ మాల మహానాడు వరంగల్, హనుమకొండ జిల్లాల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే టికెట్ త్యాగం చేసిన ఉద్యమ నాయకుడు అద్దంకి దయాకర్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన కేయూ పాలక మండలిలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమలో క్రియాశీలక భూమిక పోషించిన మాలలకు నామినేటెడ్ పోస్టుల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నే బాబురావు, కార్యదర్శి అశోద భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మేడి అంజయ్య, వెన్న రాజు, మాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ ఎలుక దేవయ్య, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ అసాది పురుషోత్తం, వరంగల్ మహా నగర అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఏర్పాట్లు పూర్తి..

- రేపటి నుంచి ఆగస్టు 5 వరకు పరీక్ష
- ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఐదు కేంద్రాలు
- 27,741మంది అభ్యర్థులు
- నిర్దేశించిన సమయానికి 10 నిమిషాల ముందుగానే గేట్లు మూసివేత

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల నియామకానికి టీజీడీఎస్సీ పరీక్ష నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 18 నుంచి (రేపు) ఆగస్టు 5వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించబోతున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఇప్పటికే అభ్యర్థులకు సంబంధిత వెబ్‌సైట్ హాల్‌టికెట్లను కూడా అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఐదు పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌పద్ధతిలో కంప్యూటర్ బేస్డ్(సీబీటీ) పరీక్ష నిర్వహించబోతున్నారు. ఐదు పరీక్షకేంద్రాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని జయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌టెక్నాలజీ అండ్ సైన్స్, చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కిషన్ పుర, హసన్‌పర్తిలోని నోబుల్‌టెక్నాలజీ అండ్‌సొల్యూషన్స్, హసన్‌పర్తి ఎర్రగట్టుగుట్టవద్ద ఉన్న అయాన్ డిజిటల్ జోన్, భీమారం సమీపంలోని పొద్దుటూరి గార్డెన్ దగ్గరలోని మోక్షిత కంప్యూటర్స్ పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయి. ప్రతీ పరీక్ష కేంద్రానికి ఒక్కో అబ్జర్వర్‌ను నియమించారు. పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించి పరిశీలించనున్నారు.13 రోజులపాటు రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరగుతాయని సంబంధిత అధికారుల ద్వారా తెలిసింది. రోజూ ఉదయం 9 గంటల నుంచి నిర్వహించే పరీక్షలకు అభ్యర్థులు రెండుగంటల ముందునుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్దేశించిన పరీక్ష సమయం ఉదయం 9 గంటలుకాగా 10 నిమిషాలు ముందుగానే ఉదయం 8.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత అభ్యర్థులకు లోపలికి అనుమతించరు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే పరీక్షలకు కూడా రెండు గంటల ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల్సింటుంది. మధ్యాహ్నం 01.50 గంటలకే పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేస్తారు. ఆ తరువాత వచ్చేవారిని లోపలికి అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాక బయోమెట్రిక్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును (ఐడింటీటీకార్డును) తీసుకుని రావాల్సింటుంది. ఐదుపరీక్ష కేంద్రాల్లో కలిపి మొత్తం 27,741మంది అభ్యర్థులు టీజీడీఎస్సీని రాయబోతున్నారు. స్కూల్ అసిస్టెంట్లు నియామకానికి ఎస్‌జీటీ తత్సమాన కేడర్‌లో టీచర్ల నియామకానికి ఈడీఎస్సీ నిర్వహించబోతున్నారు.పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దు. రాష్ట్రంలో మొత్తం 2.79 లక్షల మంది అభ్యర్థులు పరీక్షలు రాయబోతున్నారు.

వ్యవసాయ అనుబంధ రుణాలు పెంచాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రవీందర్ రావు

హన్మకొండ : బ్యాంకులు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలకు రుణాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు సూచించారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) ఆధ్వర్యంలో వాణిజ్య, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల బ్రాంచ్‌ల అధికారుల జోనల్ వర్క్ షాప్ ఆన్ బిజినెస్ అపార్చునిటీస్ ఫామ్ సెక్టార్, నాన్ ఫామ్ సెక్టార్ అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును రవీందర్ రావు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావడానికి నాబార్డు రూ.460 కోట్లు రుణాలు మంజూరు చేసిందన్నారు. నాబార్డు జీఎం ఉష మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమలను ప్రోత్సహించడానికి నాబార్డు రాయితీ అందిస్తోందన్నారు. డీసీసీబీ ముఖ్య కార్యనిర్వహణాధికారి వజీర్ సుల్తాన్, ఫౌల్ట్రీ ఫామ్స్ అధ్యక్షుడు ధర్మారావు, నాబార్డు డీడీఎం రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.